www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 25 అక్టోబర్ 2023

5

వైఎస్ఆర్



ఏకలవ్య సేవలు విస్తృత పరచాలి

కడప అర్బన్ : ఏకలవ్య ఫౌండేషన్ సేవలు విస్తృత పరచాలని ఫౌండేషన్ సలహాదారు డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఏకలవ్య ఫౌండేషన్ జిల్లా స్థాయి విద్యా కమిటీ సమావేశం మారుతీ నగర్‌లోని సంస్థ కార్యాలయంలో గౌరవ సలహాదారు డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫౌండేషన్ సేవలు, కార్యక్రమాలు మరింత విస్తృతంగా, గ్రామీణ విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీసే విధంగా ఉండాలన్నారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో అమలు చేసే నెలవారీ విద్యా కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. భవిష్యత్తు కార్యాచరణ ఏర్పాట్లపై చర్చించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ట్రస్టీ(కడప) వలపటి కార్యక్రమాల్లో గ్రామీణ క్రీడలకు చోటు కల్పించాలన్నారు. విద్యా కమిటీ చైర్మన్ బాలకృష్ణ జనవరిలో బాలికల కోసం రంగోళీ పోటీలు నిర్వహించాలన్నారు. సమావేశంలో సతీష్, జిల్లా విద్యా సమన్వయ కర్తలు నరేష్, బాలాజీ, కమిటీ సభ్యులు బాలాజీ, నరసింహులు, జయదేవ్ పాల్గొన్నారు.

పెద్దల చేతుల్లో అసైన్డ్ భూములు

- దోచుకునేందుకు ప్రభుత్వ కుట్ర
- నిజమైన అర్హులకు అందేనా?

పేదలను, దళితులను ఉద్ధరిస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం దశాబ్దాల తరబడి వారు సాగుచేసుకుంటున్న అసైన్డ్ భూములను దోచుకునేందుకు కుట్రలకు తెరలేపింది. గత ప్రభుత్వాలు అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలను ఇప్పటికే ఎత్తేసిన ప్రభుత్వం అక్కడక్కడా పేదలు, దళితుల చేతుల్లో ఉన్న కొద్దిపాటి అసైన్డ్ భూములపైనా కన్నేసింది.



ప్రజాశక్తి - చాపాడు

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 9/22 ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. ఈ ఆర్డినెన్స్ ద్వారా 20 సంవత్సరాలుగా అసైన్డ్ భూములను సాగు చేస్తున్న వాస్తవ లబ్ధిదారులకు, వారసులకు ఆ భూమిపై పూర్తి హక్కు కల్పిస్తామని చెప్పింది. లబ్ధిదారుల జాబితాను గ్రామ సచివాలయాల్లో గ్రామాల వారీగా ప్రదర్శిస్తామని వెల్లడించింది. అసైన్డ్ భూముల వివరాలు, వాస్తవ లబ్ధిదారులు, ప్రస్తుతం ఎవరి స్వాధీనంలో ఉంది అనే వివరాలను వెల్లడించి పారదర్శకత పాటిస్తామని ప్రకటనలు చేసింది. అయితే ఆచరణలో పూర్తి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజా పోరాటాల నేపథ్యంలో దళితులు, గిరిజనులకు పాలక ప్రభుత్వాలు అసైన్డ్ భూములు కేటాయించిన విషయం విదితమే. ఈ భూములు క్రయ, విక్రయాలకు అనుమతి లేకుండా 9/77 చట్టం గత కొన్ని దశాబ్దాలుగా రక్షణగా ఉంది. గ్రామాల్లో సాగుకోసం భూముల ప్రభుత్వాల పెద్ద రైతులు, వ్యాపారుల తరఫున పెట్టుబడి సాగుదారులకు అప్పులు ఇచ్చారు. ఆ అప్పులు తీర్చలేక అత్యధిక మంది భూమిని దూరం అయినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఆ భూములు పూర్తిగా తమ సొంతం చేసుకునేందుకు పెద్దలు పావులు కదుపుతున్నారు.

అత్యధిక భూములు పెద్దల చేతుల్లోనే..

జిల్లాలో గ్రామాల వారీగా భూముల లభ్యతను బట్టి 20 సెంట్ల నుంచి 2.50 ఎకరాల వరకూ పేదలకు అసైన్డ్ భూములను గత ప్రభుత్వాలు అందజేశాయి. 2003కి పూర్వం పంపిణీ చేసిన భూములు ప్రస్తుతం గ్రామాల్లో పెద్ద రైతులు, అగ్రకులాలు, వ్యాపారుల చేతుల్లో ఉన్నట్లు అనేక ఉదాహరణలున్నాయి. గ్రామాల్లో అసైన్డ్ భూమి లబ్ధిదారులు తమ భూములకు పూర్తిగా దూరమయ్యారు. ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీతో జిల్లావ్యాప్తంగా ఇటీవల సర్వే ప్రక్రియ ప్రారంభమైంది. ప్రభుత్వ, అసైన్డ్, భూధాన్ తదితర భూముల జాబితా విభజన జరిగింది. ఈ జాబితాను అధికారులు వెల్లడించకపోవటం పలు అనుమానాలకు తావిస్తోంది.

అమలుకు నోచని చట్ట సవరణ..

సబ్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా అసైన్డ్ భూముల చట్టాన్ని సవరించాలని ఎపి ప్రభుత్వం తీర్మానించి చట్ట సవరణ కోసం ఆర్డినెన్స్ జారీ చేసింది. ఇవే కాకుండా పేదలకిచ్చిన ఇళ్ల పట్టాలకు సైతం ఇది వర్తిస్తుందని సవరణ చట్టంలో స్పష్టం చేసింది. కేటాయించి పదేళ్లు దాటితే ఆయా ఇళ్ల స్థలాలపై లబ్ధిదారులకు యాజమాన్య హక్కులు లభిస్తాయి. వ్యవసాయ భూములైతే కేటాయించిన 20 ఏళ్లకు, ఇళ్ల స్థలాలైతే కేటాయించి పదేళ్లు పూర్తయిన వెంటనే వాటిపై సంబంధిత రైతులు, పేదలు, వారి వారసులకు యాజమాన్య హక్కులు లభిస్తాయని ఇందులో పేర్కొంది. ఈ ఆర్డినెన్స్‌పై గవర్నర్ కూడా సంతకం చేశారు. దీంతో అసైన్డ్ భూయజమానులకు వారి భూములపై సర్వ హక్కులు దక్కుతాయి. ఉమ్మడి జిల్లాలో లక్ష ఎకరాలకు పైగా అసైన్డ్ భూమి ఉన్నట్లు అంచనా.



ఒంటిమిట్ట రెవెన్యూ పొలంలో సర్వే నంబర్ 2050లో పేదలు ఏడేళ్ల నుంచి సాగు చేసుకుంటున్నారు. పెండ్లిమర్రి మండలం పెద్దశెట్టిపల్లె రెవెన్యూపొలం సర్వే నంబర్ 330లో యల్లటూరు , పెండ్లిమర్రి ప్రాంతాల ఎస్‌సి, ఎస్‌టిలు రూ. 4లక్షలు ఖర్చుచేసి భూములను సాగులోకి తెచ్చుకున్నారు. అటువంటి భూములకు పట్టాలు మంజూరు చేయటంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. కాశినాయన మండల పరిధిలోని గ్రామాలకు చెందిన అసైన్డ్ భూములను విజయవాడ, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు మొదలగు ప్రాంతాలకు చెందిన భూస్వాములు వందలాది ఎకరాలు అక్రమంగా అనుభవిస్తున్నారు. బ్రహ్మంగారిమఠం మండలం గొడ్లవీడులో ఒకే కుటుంబానికి చెందిన 11 మందికి 15.50 ఎకరాలిచ్చేందుకు వీలుగా జాబితాలో చోటిచ్చారు. రేకలకుంటలో మత్స్యకారుల ఆధార్ కార్డులను సేకరించి, వారి పేరుతో స్థానిక నేతలు పట్టాలు సిద్ధం చేయించారు. భూములను కేటాయించిన తర్వాత స్థానిక నేతలు తమ అధీనంలో ఉంచుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. మరి ఈ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని తిరిగి ఆ పేదలకు ఇచ్చి యాజమాన్యపు హక్కులు కల్పిస్తుందా? బినామీ పేర్లతో అనుభవిస్తున్న ఆ భూస్వాములకే కట్టబెడతారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు..

సాగులో ఉన్న పేదల భూములకు పట్టాలు ఇవ్వాలని జిల్లా భూపోరాట సాధన కమిటీ డిమాండ్ చేస్తూ పోరాటాలు సాగిస్తున్నది. జిల్లాలో ఒంటిమిట్ట, పెండ్లిమర్రి, బద్వేల్, అట్లూరు, కోడూరు, కలసపాడు, బిమఠం, వీరపునాయని పల్లె, తదితర మండలంలోని దళితులు పేదలు సాగులో ఉన్నటు వంటిభూములకు అసైన్డ్ మెంట్ కమిటీలో పట్టాలు మంజురుచేయాలని పోరాటం సాగిస్తున్నారు. అందులో భాగంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయాల ముందు భూములు సాగులో ఉన్నలబ్ధిదారులతో కలిసిధర్నాలు నిర్వహించారు. స్థానిక పేదలకు సెంటు భూమి అసైన్డ్ మెంట్ కమిటీలో ఇవ్వలేదని స్థానిక ఎమ్మెల్యేల అనుచరులకు, అనర్హులకు ప్రభుత్వ భూములను అప్పజెప్పారని ఆరోపించారు. ఇప్పటికే అన్యాక్రాంతం అయిన భూములను స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ అధికారులకు అనేకదపాలుగా ఆందోళనరూపంలో వినతిపత్రాలు ఇచ్చిన అధికారులు వాటిని విస్మరించారు. ఎళ్లతరబడి పేదలు సాగులో ఉన్నప్పటికీ అసైన్‌మెంట్‌లో పట్టాలు మంజురుచేయటం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం అసైన్డ్ మెంట్ కమిటీలో స్థానిక దళితులు, పేదలకు పట్టాలు మంజురుచేయాలని కోరుతున్నారు.

మైనర్లకు వాహనాలిస్తే శిక్షార్హులే

- ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్

ప్రజాశక్తి - కడప అర్బన్

రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా ఎస్.పి సిద్దార్థ్ కౌశల్ వినూత్న సందేశాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు వారికి పెద్ద ఎత్తున కౌన్సెలింగ్ చేపట్టారు. తల్లిదండ్రులు నిబంధనలకు విరుద్ధంగా మైనర్ పిల్లలకు వాహనాలు ఇచ్చి వారి అందమైన భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టవద్దని, అజాగ్రత్త, నిర్లక్ష్యంతో పిల్లలకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని ఎస్‌పి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఇటీవల నగరంలో ఎస్‌పి పర్యవేక్షణలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ లో పట్టుబడ్డ 1004 వాహనాలను కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించి గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. పట్టుబడ్డ వాహనాల్లో బుల్లెట్ వాహనంపై పర్యటిస్తూ స్వయంగా తనిఖీల్లో పాల్గొని 296 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్ మాట్లాడుతూ మరోసారి పట్టుబడితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేసి వాహనాలను కోర్టులో అప్పజెప్పి సీజ్ చేయిస్తామని హెచ్చరించారు. అజాగ్రత్త, నిర్లక్ష్యం వద్దని సూచించారు. తెలిసి తెలియని వయసులోని పిల్లలకు వాహనాలు ఇవ్వడం ద్వారా మీ పిల్లల ప్రాణాలతో పాటు రోడ్డుపై వెళ్లే అమాయకులైన ఎదుటి వారికి ప్రాణాపాయం జరుగుతుందని గుర్తుంచుకోవాలని తెలిపారు. అర్ధరాత్రి పూట అనవసరంగా రోడ్లపై తిరుగుతూ పోలీసులకు పట్టుబడ్డ ఆకతాయిలకు ఎస్‌పి కౌన్సెలింగ్ ఇచ్చారు. అదనపు ఎస్‌పి తుషార్ డూడి మాట్లాడుతూ ప్రజలు పోలీస్ సేవలను గుర్తించలేని పరిస్థితిలో ఉంటారని, వాహన తనిఖీల్లో ఎవరైనా సిబ్బంది వాహనాన్ని ఆపినప4డు ఎదురు ప్రశ్నిస్తారని, కానీ వారిని ప్రమాదాల బారిన పడకుండా సురక్షితం చేయడమే పోలీసుల ఉద్దేశమని తెలిపారు. మంచి కార్యక్రమాన్ని ఎస్‌పి నిర్వహించడాన్ని అందరూ స్వాగతిస్తున్నారని, ఇది శుభ పరిణామమని చెప్పారు. కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్‌పి కృష్ణారావు, కడప డిఎస్‌పి ఎం.డి షరీఫ్, ఎఆర్ డిఎస్‌పి బి. రమణయ్య, నగరంలోని సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌పి

డిసెంబర్ 4న చలో ఢిల్లీ : వ్య.కా.స

ప్రజాశక్తి-పెండ్లిమర్రి

రాష్ట్రంలో సామాజిక హక్కులు, ఆర్థిక భూమి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 4న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన క్యాదర్శి అన్వేష్ పేర్కొన్నారు. మంగళవారం పెండ్లిమర్రి దళితవాడలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 75 ఏళ్ల స్వతంత్ర భారత దేశంలో నేటికీ దళితులపై దాడులు, అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. మణిపూర్‌లో మనువాదుల చేతుల్లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేయడం యావత్ భారత దేశాన్ని తలదించుకునేలా చేసిందని వాపోయారు. ఇంత జరిగిన మతోన్మాద ప్రధానమంత్రి మోడీ పల్లెత్తు మాట మాట్లాడకపోవడం, దాడులు చేసిన వారికి రక్షణ కల్పించడం సిగ్గుచేటు అన్నారు. బిజెపి రెండో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత సబ్ ప్లాన్ చట్టాన్ని రద్దు చేసిందని పేర్కొన్నారు. దళితుల హక్కులను పాలక పక్షాలు హరించి వేస్తున్నాయని ఆవే దన వ్యక్తం చేశారు. ఎస్సీ ఎస్టీ బ్యాక్లాగ్ పోస్టులను భర్తీ చేయ కుండా దళితులకు ద్రోహం చేస్తున్నారని తెలిపారు. దళిత హక్కులు, సామాజిక ఆర్థిక భూమి సమస్యల పరిష్కారం కోసంతో పాటు 21 డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా వ్యవ సాయ కార్మిక సంఘం కెవిపిఎస్ కోటి సంతకాల సేకరణ ఉద్యమం చేపడుతోందని, డిసెంబర్ 4న రాష్ట్ర పతికి చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా సమర్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు మల్లేషు, ఉత్తయ్య, పగడాలయ్యా, ఓబులేసు ఈశ్వరయ్య, బాల గంగయ్య, లక్ష్మీనరసయ్య పాల్గొన్నారు

పెద్దదర్గాను దర్శించుకున్న ముస్లిం ఐక్యవేదిక సభ్యులు

ప్రజాశక్తి- కడప అర్బన్

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన అమీన్ పీర్(పెద్ద దర్గా)ను ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు మంగళవారం దర్శించుకున్నారు. ముందుగా పెద్ద దర్గాలో ప్రార్థన చేసి దర్గా విశిష్టతలను అడిగి తెలు సుకున్నారు ఈ సందర్భంగా ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్, జియావుల్ రెహమాన్ మాట్లాడుతూ రాష్ట్ర పర్యటనలో భాగంగా కడపలో ముస్లిం ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ సమావేశం నిర్వహించామని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టనున్న కార్యక్రమాలు అనుసరించాల్సిన వ్యవహారాలపై చర్చించినట్టు తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీలపై ఒత్తిడి పెంచి ముస్లిములు అత్యధిక శాతం సీట్లు వచ్చేలా రాజ్యాధికారం దిశగా హక్కుల కోసం పోరాటాలు కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జాఫర్, సయ్యద్ ఖలీల్, నూర్, సలావుద్దీన్(గుంటూరు), కలాం, జాబిద్, నాయకులు పాల్గొన్నారు.



పెద్ద దర్గాను సందర్శిస్తున్న కమిటీ సభ్యులు

గ్రామాల్లో పిచ్చికుక్క స్వైర విహారం

- ఏడుగురికి గాయాలు

ప్రజాశక్తి-అట్లూరు

మండలంలోని పలు గ్రామాలల్లో పిచ్చికుక్క స్వైర విహారం చేస్తూ ఒకే రోజు ఏడుగురిపై దాడి చేసింది. మంగళవారం ఉదయం నుంచి స్వైర విహారం చేసి ఏడుగురిని తీవ్రంగా గాయపరిచింది. చివరికి కమలకూరులో స్థానికులు పిచ్చికుక్కను చంపేశారు. మణ్యంవారిపల్లె, కమలకూరు పంచాయతీలోని పలు గ్రామాలల్లో దారివెంట వెళ్తున్న వారిపై పిచ్చికుక్క దాడిచేసింది. కమలకూరుకు చెందిన వెంకటసుబ్బయ్యను చేతివేలిని తినేసింది, కాటంవారిపల్లె గంగయ్య, మన్యంవారిపల్లెకు చెందిన చిన్నపరెడ్డిపై పొట్టపై దాడిచేసి గాయపరిచింది. అదేగ్రామాలకు చెందిన వంశి వర్ధన్ రెడ్డిని చేతివేలిని తీవ్రంగా కొరికేయడంతో రక్తం స్రావమైంది. పార్వతిపురంలో ఇంటి బయట ఆడుకుంటున్న నిహారికపై పిచ్చికుక్క తలపై దాడి చేసింది. సుబ్రమణ్యం, శుభచంద్రారెడ్డిపై తొడపై తీవ్రంగా గాయపరిచింది. వీరు చికిత్స నిమిత్తం వెంటనే బద్వేలు ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లారు.



బాధితుడి వేలును గాయపరిచిన పిచ్చికుక్క

ఊరూరా జగనాసుర దహనం : టిడిపి

కడప అర్బన్ : రాష్ట్రంలో గ్రామ గ్రామానా ప్రజలు జగనాసుర దహన కార్యక్రమాలు చేపట్టారని తెలుగుదేశం పార్టీ కడప నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి వి.ఎస్. అమీర్ బాబు, సీనియర్ నాయకులు ఆలంఖాన్ పల్లె లక్ష్మీరెడ్డి, మన్మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని 48 వ డివిజన్‌లోని రామచంద్రాపురంలో 'బాబుతో నేను' కార్యక్రమంలో భాగంగా విస్తృతంగా పర్యటన చేస్తూ ప్రజలకు చంద్రబాబు అక్రమ అరెస్ట్ పైనా, భవిష్యత్‌కు గ్యారెంటీ పథకాల గురించి భవిష్యత్తుకి గ్యారెంటీ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలను, మేనిఫెస్టోను చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే అమలు చేస్తారన్నారు. కార్యక్రమంలో మన్మోహన్ రెడ్డి, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు, తెలుగు యువత నగర అధ్యక్షులు మేకల వెంకటేష్ యాదవ్, నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య, ఉపాధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది లింగాల శివ శంకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేష్, మాజీ వార్డు నెంబర్ జయరాం రెడ్డి, పాలకొండ స్వామి మాజీ చైర్మన్ ఓబుల్ రెడ్డి, యువ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదాతలు కావాలి

కడప : రక్తదానం మరొకరికి ప్రాణదానమని ప్రతి ఇంట్లో ఒక రక్త దాత కావాలని విజయ దుర్గ ఆలయ నిర్వహకులు దుర్గా ప్రసాద్ అన్నారు. విజయదశమి దసరా ఉత్సవాలు భాగంగా విజయ దుర్గ టెంపుల్‌లో మంగళవారం రక్తదాన కరపత్రాలను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సందర్భంలో దుర్గాప్రసాద్ మాట్లాడుతూ దాదాపు మూడు సంవత్సరాల నుంచి కడప నగరంలో ఐఆర్ సి సభ్యులు అబ్దుల్ రాయల్ కరీముల్లా రక్త దాన కరపత్రాలు పంచడం విశేషమన్నారు

పీస్ ఇస్లామిక్ స్కూల్‌కు పతకాల పంట

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని మరియాపురంలో ఉన్న పీస్ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు క్రీడల్లో ప్రావీణ్యాన్ని ప్రదర్శించి పతకాలు సాధించారని పీస్ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ సయ్యద్ గౌస్ పీర్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తమ విద్యార్థులు కడప 5వ ఇంటర్ స్టేట్ తైక్వాండో ఛాంపియన్ షిప్ ఈనెల 21,22 తేదీలలో శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, తిరుపతి లో నిర్వహించిన పోటీలలో ప్రతిభ చూపాలని పేర్కొ న్నారు. ఐదవ తరగతి చదువుతున్న షేక్. నూర్ బాషా, షేక్. ఇబ్రహీం గోల్డ్ మెడల్స్, యస్. సురేంద్రకుమార్ సిల్వర్ మెడల్ సాధించారని చెప్పారు. డిసెంబర్ 9, 10 తేదీలలో బెంగుళూరులో నిర్వహించే జాతీయ స్థాయిలో నిర్వహించబోయే పోటీలో పాల్గొని మంచి బహుమతులు అందుకోవాలని ఆశిస్తునట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు మంచి క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు స్పోర్ట్స్‌లో కూడా మంచి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మరెన్నో పతకాలు సాధించాలని ఆకాక్షించారు.



విద్యార్థులను అభినందిస్తున్న గౌస్‌పీర్

విజయదుర్గాదేవి ఆలయాన్ని సందర్శించిన కలెక్టర్

కడప అర్బన్ : విజయదశమి పండుగను పురస్కరించుకుని శ్రీశ్రీశ్రీ ఆలయాన్ని కలెక్టర్ విజయరామరాజు, జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్, ఆర్డీవో ధర్మచంద్రారెడ్డి సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జున, కార్యనిర్వాహక కార్యదర్శి దుర్గాప్రసాద్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

కడప : కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి 30 రోజులపాటు గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత ఆసక్తిగల నిరుద్యోగ మహిళలు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 18-45 సంవత్సరాలలోపు వయస్సు గల గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ మహిళలు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ పొందేందుకు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు 9440905478, 9985606866లలో సంప్రదించవచ్చునని తెలిపారు. దూర ప్రాంతాల నుండి వచ్చే వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.

పలువురు టిడిపిలో చేరిక

కడప అర్బన్ : నగరంలోని 5వ డివిజన్ అశోక్ నగర్ లో కొమ్మాలపాటి సురేష్ ఆధ్వర్యంలో 50 కుటుంబాలు వైసిపి నుంచి తెలుగు దేశం పార్టీలో చేరాయి. మంగళవారం టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాస రెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆర్ మాధవిరెడ్డి పలువురికి టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొన్నారు. వైసిపి పాలనతో ప్రజలు విసిగిపోయారని చెప్పారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జి సుంకర శ్రీనివాస్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాధవిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మహమ్మద్ అలీ

శ్మశాన వాటిక తొలగింపు అన్యాయం

ప్రజాశక్తి - కడప

కడప నగరంలోని యాకూబ్ సాహెబ్ మసీదు శ్మశాన వాటిక స్థలాన్ని రోడ్డు విస్తరణ పేరుతో అక్రమంగా తొలగించడం అన్యాయమని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ డిపార్ట్‌మెంట్ ఉపాధ్యక్షులు పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, కాంగ్రెస్ పార్టీ కడప నగర అధ్యక్షుడు వై. విష్ణు ప్రీతంరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ముస్లిములకు అత్యంత పవిత్రమైన యాకూబ్ సాహెబ్ మసీదు శ్మశాన వాటికలో కొంత స్థలాన్ని కడప కార్పొరేషన్ అధికారులు చేపట్టిన తొలగింపు చర్యలు సబబు కాదని ఆరోపించారు. చట్ట బద్ధంగా విధి విధానాల ప్రకారం భూ సేకరణకు అధికారులు ప్రయత్నించ లేదన్నారు . కేవలం ఏకపక్షంగా మసీదు స్థలాన్ని, వాటికలోని అత్యంత విలువైన కొంత భాగాన్ని స్వాధీన పర్చుకోవడానికి చేపట్టిన చర్యలు అనధికారిక పరిధి కింద వస్తాయన్నారు. అధికార వైసీపీ ప్రభుత్వంలోని నేతల ఒత్తిళ్లకు తలొగ్గి మసీదు కమిటీ అంగీకారంతో ప్రమేయం లేకుండా రూ. 7.80 కోట్ల నష్టపరిహారాన్ని వక్ఫ్ బోర్డులో జమ చేసి చేతులు దులుపుకున్నారన్నారు. ఈ విషయం మసీదు కమిటీకి తెలియకపోగా, చివరి దశలో అధికారులు శ్మశాన వాటికలో కొంత భాగాన్ని తొలగించడానికి సిద్ధం కావడం చట్టం విరుద్ధమన్నారు. వెంటనే మసీదు శ్మశాన వాటిక స్థల స్వాధీనాన్ని ఆపకపోతే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో పిసిసి రాష్ట్ర కార్య దర్శులు వెంకటరమణారెడ్డి, చీకటి చార్లెస్, ఎన్ఎస్‌యు ఐజిల్లా అధ్యక్షుడు మామిళ్ళ బాబు పాల్గొన్నారు.

రక్తదానం మరొకరి ప్రాణం నిలబెడుతుంది

ప్రజాశక్తి - కడప

రక్తదానం మరొకరి ప్రాణాన్ని నిలబెడుతుందని ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, వైసిపి జిల్లా అధ్యక్షులు సురేష్‌బాబు పేర్కొన్నారు. మంగళశారం యువ నాయకులు దేవి రెడ్డి ఆదిత్య జన్మదిన సందర్భంగా మంగళవారం కడప నగరం రాజారెడ్డి వీధిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. దేవి రెడ్డి ఆదిత్య జన్మదిన సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషించదగ్గ విషయం అని వారు అన్నారు. రాబోవు రోజుల్లో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. తొలుత కేక్ కట్ చేసి దేవి రెడ్డి ఆదిత కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. వైసిపి పార్టీలు రాబోవు రోజుల్లో ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వల్లూరు వంశీ రెడ్డి కార్పొరేటర్లు సూర్యనారాయణ, షఫీ, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మియ్యా, వైసిపి నాయకులు, యువత పాల్గొన్నారు.



రక్తదాతను అభినందిస్తున్న డిప్యూటీ సింఎం

సర్వం కోల్పోయా.. ఆదుకోండి సారూ!

ప్రజాశక్తి-చెన్నూరు

తాను చేపలు విక్రయించుకుని జీవనం సాగిస్తున్నానని, సోమవారం సాయంత్రం గ్యాస్ లీకై ఇంట్లోని విలువైన వస్తువులు, సర్టిఫికెట్లు మొత్తం కాలి బూడిదయ్యాయని, ప్రభు త్వమే ఆదుకోవాలని బెస్త కాలనీకి చెందిన వద్దు బోయిన వెంకట సుబ్బయ్య అనే మత్స్యకారుడు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పండుగ రోజు సాయంత్రం 5 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో గ్యాస్ లీకయి మంటలు వ్యాపించి ఇంట్లోని నగదు, దుస్తులు, సర్టిఫికెట్లు కాలిపోయాయయని పేర్కొన్నారు. తనకు భార్య, ముగ్గురు పిల్లలున్నారని, సర్వ కోల్పోయాయయని ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలి కోరారు.



ప్రమాదంలో కాలిన వెంకటసుబ్బయ్య ఇల్లు



అన్నదానం చేస్తున్న మాజీ సర్పంచ్‌లు

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-కలసపాడు

అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని లింగారెడ్డి పల్లె మాజీ సర్పంచ్‌లు, రంగారెడ్డి, బాల వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం దసరా పండగ ఉత్సవాల్లో భాగంగా లింగారెడ్డి పల్లెలో బాలింతమ్మ తల్లి దేవస్థానం వద్ద పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం, మహిళల చే కోలాటం, ఇతర సంస్కృతి కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అనంతరం కొత్తపల్లి, వంశ స్థలం దరూ బాలింతమ్మ తల్లికి అర్చనలు చేసి, కుంకు మార్చనలతో పూజించారు. అనంతరం లింగారెడ్డి పల్లె రాష్ట్ర అవార్డు గ్రహీత ఎస్. భజన పుల్లయ్య అల్లుడు, ముండ్లపాటి, ప్రసాద్ రావు ఆధ్వర్యంలో లింగారెడ్డి పల్లె మురళీకృష్ణ కోలాట బృందంచే, ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్ర మంలో భక్తులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. **కడప :** విజయదశమి పర్వదిన సందర్భంగా మంగళవారం కడప నగరం చిన్నచౌకు వికె హోండా షోరూం ఎదురుగా బిసి నాయకులు దాసరి సురేష్ యాదవ్, వైఎస్ జగన్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు, వైసిపి సీనియర్ నాయకులు మలిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఏడాది అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా విజయదశమి పర్వదిన సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు డి.సుబ్బరాయుడు, కొండాయపల్లి మధుసూదన్ రావు, చంగల్ రాజు పాల్గొన్నారు.

పేదలను స్వశక్తిపై నిలిపేందుకు కృషి

కడప అర్బన్ : పేదలు, బడుగు వర్గాలను స్వశక్తిపై నిలిపేందుకు కృషి చేద్దామని లయన్ డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేటర్ కె.చిన్నపరెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య కార్యాలయంలో అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. క్లబ్ కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పాటై మూడు నెలలు గడిచిన సందర్భంగా వార్షిక నివేదికను అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన చిన్నపరెడ్డి మాట్లాడుతూ పేదలకు తాత్కాలిక సాయం చేయడంతోపాటు వీలైనంత వరకు వారిని స్వశక్తిపై నిలిపేందుకు కుట్టు శిక్షణ, ఇతర వృత్తి విద్యలను నేర్పాలని సూచించారు. హైవేలపై ప్రమాదాల నివారణకు నగరం, పట్టణాల్లో ఆటో ప్రమాదాల నివారణకు డ్రైవర్లతో అధికారుల సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలోపోతుల వెంకట్రామిరెడ్డి, కొండూరు జనార్దన్‌రాజు, ప్రజలు పాల్గొన్నారు.


ప్రజాసమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పని చేస్తోందని ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. పులివెందులలో మంగళవారం ఆయన నివాసం వద్దకు వచ్చిన నాయకులతో ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రభుత్వం నుంచి లబ్ది పొందిన వారికి పథకాలను వివరించాలని సూచించారు. ప్రజా సమస్యలను తెలుసుకొని సంబంధించిన అధికారులతో మాట్లాడి పరిష్కరింపజేయాలని సూచించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతి గడపకు జగనన్న ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందాయన్నారు. అర్హులకు తప్పక సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. అనంతరం ఆయన అక్కడికి వచ్చిన ప్రజా సమస్యలను అడిగి వాటి పరిష్కారానికి కృషి చేశారు. కార్యక్రమంలో బలరాంరెడ్డి, పుష్ప నాథ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు

వైసిపి యువనేత డాక్టర్ నవజ్యోత్‌రెడ్డి

ప్రజాశక్తి - ముద్దనూరు



ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి రాజకీయాలకు, పార్టీలకు, కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని జమ్మలమడుగు నియోజకవర్గ వైసిపి యువనేత డాక్టర్ నవజ్యోత్‌రెడ్డి తెలిపారు. 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలు లబ్ది పొందేలా జగన్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి అందిస్తున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రజల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటునందిస్తోందన్నారు. తన పాదయాత్ర, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను జగన్ వంద శాతం అమలు చేశారన్నారు. ప్రజా శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తూ పారదర్శకంగా పరిపాలన సాగిస్తున్నారన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయరంగాల అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చి రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపారన్నారు. నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలలు, కళాశాలలకు వసతులు కల్పించారన్నారు. రోగులకు, విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్య, వైద్యం అందిస్తూ దేశంలో ఆదర్శంగా నిలిచారన్నారు. సిఎం జగన్, ఎంపీ అవినాష్‌రెడ్డి సహాయ సహకారాలతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి పాటు పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ.. ప్రజా సమస్యలపై దృష్టి సారించి పరిష్కరిస్తున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని జగన్ నిరూపించారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం మళ్ళీ అధికారంలోకి వచ్చేలా ప్రజలు తమ అమూల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తుకు వేయాలని ఆయన కోరారు.

టికెట్ ధర తగ్గించాలని ఆర్‌టిసి డిఎంకు వినతి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఆర్.తుమ్మలపల్లి గ్రామానికి ఆర్‌టిసి వారు రూ.20 టికెట్ వసూలు చేయడం అన్యాయమని తుమ్మలపల్లి సర్పంచ్ గజ్జల అనూష మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం డిపో మేనేజర్‌ను కలిసి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్‌టిసి బస్సు పులివెందుల నుంచి తుమ్మలపల్లె వెళ్లే వారికి రూ.20 వసూలు చేస్తున్నారని, ఫస్ట్‌స్టాప్‌కు మాత్రం రూ.10 చేయాల్సి ఉందన్నారు. అక్కడి నుంచి తుమ్మలపల్లి 200 మీటర్లు ఉండదని కానీ అక్కడ నుంచి మళ్లీ రూ.10 వసూలు చేయడం అన్యాయమన్నారు. రాయలపురం, తుమ్మలపల్లి, లచ్చుమారిపల్లి ఒకే పంచాయతీకి కిందికి వస్తాయని పేర్కొన్నారు. గతంలో కూడా ఈ విషయం ఎంపీ దృష్టికి తీసుకెళ్లామని, అలాగే గత డిపో మేనేజర్‌కు కూడా వివరించామన్నారు. ఈ విషయాన్ని ఆర్‌ఎం దృష్టికి తీసుకువెళ్తామని డిఎం చెప్పారని తెలిపారు. కార్యక్రమంలో కె.రామాంజనేయరెడ్డి ఉన్నారు.

రాణివనంలో 'బాబుతో నేను'

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని రాణివనంలో మంగళవారం బాబుతో నేను, భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి ఆయన ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వ వైఫల్యాన్ని వివరించారు. టిడిపి అధికారంలోకి రాగానే అమలుపరిచే పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. రాబోవు ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి జయరామిరెడ్డి, మండల టిడిపి అధ్యక్షులు మోహన్‌రెడ్డి, నాయకులు బయపురెడ్డి, సంజీవ రెడ్డి, సేట్, నాగేశ్వరరావు, శ్రీనివాసులు, రమేష్‌రెడ్డి, శివారెడ్డి, బాషా, టైలర్ మాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తున్న భూపేష్‌రెడ్డి

జగనాసుర దహనాన్ని నిర్వహించిన భూపేష్..

స్థానిక టిడిపి కార్యాలయంలో భూపేష్‌రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి జగన్నాసుర దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయదశమి రోజున రావణాసురున్ని దహనం చేసే, రాష్ట్ర క్షేమం కోసం జగన్నాసురుడి దహనం నిర్వహించినట్లు భూపేష్ తెలిపారు. సైకో పోవాలి అని రాసి ఉన్న పత్రాలను జాతీయ రహదారిపై కాల్చి నిరసన తెలిపారు.

చంద్రబాబును వేధింపులకు గురిచేయడం తగదు

ప్రజాశక్తి - ఖాజీపేట

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును వేధింపులకు గురి చేయడం తగదని టిడిపి రాష్ట్ర సీనియర్ నాయకుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ పిలుపు మేరకు.. విజయదశమి సందర్భంగా సోమవారం సాయంత్రం ఆయన తన స్వగ్రామం దుంపల గట్టులో జగన్, మంత్రులు, వైసిపి నేతల తలలతో ఉన్న సైకో పోవాలి అనే నినాదంతో ఉన్న ప్లకార్డులను దహనం చేశారు. కార్యక్రమంలో టిడిపి నేతలు రెడ్యం నాగేశ్వరెడ్డి, మామిళ్ల సుబ్బారెడ్డి, ఇండ్ల వెంకట్‌రెడ్డి, తవ్వా సుబ్బారెడ్డి, దాసరి బాలయాదవ్, బండి వెంకటసుబ్బారెడ్డి, మున్నెల్లి సుబ్బ రాయుడు, ఇండ్ల పుల్లా రెడ్డి, కల్లూరు మల్లికార్జున, తొర్రి వేముల బాలయ్య, పత్తి పుల్లారెడ్డి, తప్పెట కృష్ణారెడ్డి, తుమ్మల రామసుబ్బారెడ్డి, పెద్ద ఎత్తున టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కారమయ్యేనా..!


సమస్యలను ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి వివరిస్తున్న ఆశావర్కర్లు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - చాపాడు

పనిభారం, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం, కనీస వేతనం రూ.26వేలు వంటి ఆశావర్కర్ల సమస్యల పరిష్కారానికి ఆశావర్కర్లు కొంతకాలంగా పోరాటాలు సాగిస్తున్నారు. దీనిపై ప్రభుత్వంలో ఎలాంటి స్పందన లేదని పలువురు పేర్కొంటున్నారు. వారు చేస్తున్న పోరాటాన్ని అణగదొక్కేందుకు ప్రయత్నాలు చేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆశా కార్యకర్తలు నిరసనలు, కలక్టరేట్ ముట్టడి, ప్రజాప్రతినిధులను కలిసి వినతి పత్రాలను అందించడం వంటి నిరంతర నిరసనలు కొనసాగిస్తున్నారు. కరోనా సమయంలో ఫ్రంట్‌లైన్‌లో పనిచేసిన ఆశా కార్యకర్తలకు నేడు నెలల తరబడి జీతాలు ఇవ్వడం లేదు. కనీస వేతనం అమలు చేయడం లేదు. గౌరవ వేతనం ఇచ్చి ప్రభుత్వం వెట్టిచాకిరి చేయిస్తోందనే విమర్శలు లేక పోలేదు. సంవత్సరం పొడవునా పని చేయాల్సిన పరిస్థితి ఉంది. ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్, ఇఎస్‌ఐ సౌకర్యం అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని కోరుతున్నారు. ఆశా వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఆశా వర్కర్లకు సంబంధం లేని పనులు అప్పగిస్తున్నారని, నాణ్యమైన ఫోన్లు ఇవ్వలేదని వాపోతున్నారు. ప్రస్తుతం జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆశా కార్యకర్తలు హాజరౌతున్నారు. గ్రామాల్లో వైద్య సిబ్బందికి సహాయకులుగా వీరికి పని ఒత్తిడి ఎక్కువైంది. వేతనాలు సరిగా అందక సతమతం అవుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. తమ డిమాండ్లు, సమస్యలను మైదుకూరు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డికి ఆశా కార్యకర్తలు వివరించారు. తమ న్యాయమైన సమస్యలు, డిమాండ్లను నెరవేర్చాలని వారు కోరారు.

వేతనాలు పెంచి ఇవ్వాలి..



ఆశా వర్కర్లకు అన్ని రకాల ఆరోగ్య సంబంధమైన పనులను అప్పగిస్తున్నారు. ప్రతిరోజు ఏదోక సర్వే పేరుతో పని అప్పగిస్తున్నారు. ప్రస్తుతం 20 రోజులుగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొంటున్నాం. ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18వేలు పెంచి ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- లక్ష్మి, ఆశా కార్యకర్త, చాపాడు

సంక్షేమ పథకాలు అమలు చేయాలి



ఆశా కార్యకర్తలకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల సంక్షేమ పథకాలు అమలయ్యేలా ప్రభుత్వం చూడాలి. నిత్యం ప్రజా ఆరోగ్య సమస్యలపై సహకారం అందిస్తున్న ఆశా కార్యకర్తలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా వేతనాలు పెంచి ఇవ్వాలి. కుటుంబ పోషణ ప్రస్తుతం అందుతున్న వేతనాలతో కష్టంగా ఉంది.

- నరసమ్మ, ఆశా కార్యకర్త, చాపాడు

విలువిద్య అతి ప్రాచీన క్రీడ : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె


విల్లును పరిశీలిస్తున్న తులసిరెడ్డి

ప్రజా జీవితంలో భాగమైన విలువిద్య అతి ప్రాచీన క్రీడ అని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆటస్థలంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలను ఆయన పరిశీలించారు. అలాగే క్రీడాకారులు వెంట తెచ్చుకొన్న బాణాలు, విల్లు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ పూర్వ కాలంలో ఆదిమానవుడు ఆత్మ రక్షణతోపాటు ఆహార సం పాదన కోసం విలువిద్యను ఉపయోగించేవారని తెలిపారు. ఆధునిక మాన వుడు విలువిద్యను ఒక క్రీడగా, కళగా చూస్తున్నారని తెలిపారు. విలువిద్యకు భార తీయ సంస్కృతికి అవినాభావ సంబంధం ఉంద న్నారు. శ్రీరాముడు, శివుడు, అర్జునుడు, ద్రోణుడు, ఏకలవ్యుడు, కర్ణుడు గొప్ప విలు కాండ్రులని తెలిపారు. విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు విలువిద్య ద్వారా ఆంగ్లే యులను ముప్పుతిప్పలు పెట్టాడని వివరించారు. వేంపల్లెలో రాష్ట్రస్థాయిలో విలువిద్య క్రీడా పో టీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఒలింపిక్స్, ఆసియా క్రీడల్లో, కామన్వెల్త్ పోటీల్లో అవార్డులు పొందడం హర్షణీయమన్నారు. అంధ్రుడు అయినప్పటికీ చెరుకూరి సత్యనారాయణ విలువిద్య క్రీడాకారులను ప్రోత్సహించడం గర్వకారణమన్నారు. అర్జునుడు, శ్రీరాముడు, అభినవ్ బింద్రా, దీపికా కుమారి, జ్యోతి సురేఖ వంటి వారిగా విలు విద్య క్రీడా కారులు తయారు కావాలని ఆయన ఆకాం క్షించారు. అనంతరం వోల్గా అర్చరీ అకాడమీ తరు పున తులసిరెడ్డిని సత్కరించారు. కార్యక్ర మంలో కాంగ్రెస్ నాయకులు నరసింహారెడ్డి, అమర్నాథరెడ్డి, ఉత్తన్న, వినయ్, అర్చరీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ, సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రెడ్లకు ప్రత్యేక స్థానం ఉంది : ఎమ్మెల్యే


రెడ్ల ఘన చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల్లో కూడా రెడ్లకు ప్రత్యేకస్థానం ఉందని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో మంగళవారం రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రెడ్ల ఘన చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెడ్ల ఘన చరిత్రను పుస్తక రూపంలో ఆవిష్కరించడం శుభపరిణామన్నారు. ఆర్థికంగా వెనుకబడిన రెడ్ల సామాజిక వర్గానికి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం తోడ్పాటునిస్తుందన్నారు. కార్యక్రమాన్ని రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఒంటెద్దు రామలింగారెడ్డి(బాబు) ఆధ్వర్యంలో నిర్వహించగా, రాష్ట్ర వ్యవసాయ కార్యదర్శి ఆలమూరు జగన్మోహన్‌రెడ్డి, లింగారెడ్డి, హరినాథ్‌రెడ్డి, ప్రభంజన్‌రెడ్డి(భాను) పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఒక వరం లాంటిదని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో మంగళవారం అయిదు మంది లబ్దిదారులకు రూ.4,30,000సిఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ వర్తించని వారికి సిఎం సహాయ నిధి ఎంతో ఉపయోగమన్నారు. మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం లబ్ధిదారులు ఎమ్మెల్యే ప్రత్యేక కృషికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి పట్టణాధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, నాయకులు వేణుయాదవ్, బుజ్జి, మహేశ్వర్‌రెడ్డి, యోబు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రాణం విలువ గుర్తించు.. ప్రమాదాలను నివారించు

ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్



మనిషి జీవితంలో అత్యంత విలువైంది ప్రాణం. కానీ అనేక మంది వివిధ సందర్భాల్లో నిర్లక్ష్యం.. అజాగ్రత్త కారణంగా ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ప్రాణం విలువ గుర్తించి.. ప్రమాదాలను నివారించుకోవాలని ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు డాక్టర్ సి. విద్యాసాగర్‌రెడ్డి అన్నారు. 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వాహనాలు నడిపే సమయంలో, ఇంట్లో గ్యాస్ వినియోగం విషయంలో, ప్రకృతి వైపరీత్యాల సమయంలోగానీ తగిన జాగ్రత్తలు తీసుకోని కారణంగా కొందరు మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువయ్యాయని తెలిపారు. వాహనాలు నడిపే విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం, నిర్లక్ష్యం, నిద్రమత్తు, మద్యం సేవించి వాహనం నడపడం ఇలా కారణం ఏదైనా కావచ్చు అన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల జరిగే ప్రాణ నష్టం, గాయాల సంఖ్య తగ్గిం చేందుకు తీసుకోవాల్సిన నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి ఏడాది అక్టోబర్ 17న ప్రపం చ ట్రామా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయాలైతే..

సాధారణంగా రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మందికి తలకు గాయాలవుతుంటాయని చెప్పారు. ఎత్తైన ప్రదేశాల నుంచి కిందపడినా తలకు గాయాలవుతాయన్నారు. శరీరంలో ఏ భాగంలో లేని నాడులు తలలో ఉంటాయన్నారు. అందుకే తలకు దెబ్బ తగిలితే ప్రాణాంతకమని హెచ్చరించారు. కొన్నిసార్లు తీవ్రమైన ప్రమాదం జరిగినా రక్తం బయటకు రాదని చెప్పారు. అందుకే తలపై ఏ చిన్న దెబ్బతగిలినా తీవ్రమైన ప్రమాదం జరిగినా రక్తం బయటకు రాదన్నారు. తలకు ఏ చిన్న దెబ్బ తగిలినా వెంటనే వైద్యులను సంప్రదించాలని విద్యాసాగర్‌రెడ్డి సూచించారు.

బైకుపై ప్రయాణించే సమయంలో..

బైక్‌పై ప్రయాణించే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలని తెలిపారు. వెనుక కూర్చున్న వ్యక్తులు హెల్మెట్ పెట్టుకుంటే ఇంకా మంచిదన్నారు. బైక్‌పై ఉన్న ఇద్దరూ హెల్మెట్ పెట్టుకుంటే శ్రేయస్కరమని వివరించారు.

కారులో ప్రయాణించినా..

కారులో ప్రయాణించేవారు సీట్‌బెల్టు పెట్టుకోవడం మరిచిపోవద్దని కోరారు. మద్యం సేవించి వాహనం నడపడం లాంటివి చేయవద్దని పేర్కొన్నారు.

సైక్లింగ్, ట్రెక్కింగ్ సమయంలో..

సైక్లింగ్ చేసే వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతుందన్నారు. ఎత్తుపల్లాలు ఉన్న ప్రాంతాల్లో సైకిల్ రైడ్ ప్రమాదకారణమని తెలిపారు. స్కేటింగ్ చేసినప్పుడు కూడా నేల ఎత్తు పల్లాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. సైక్లింగ్, ట్రెక్కింగ్ చేసే సమ యంలో ఖచ్చితంగా హెడ్‌గేర్ ఉపయోగించాలని చెప్పారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

రహదారి భద్రతా నియమాలను ఖచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు. డ్రైవింగ్ చేసే సమయంలో హెచ్చరిక, ట్రాఫిక్ సిగ్నల్స్‌పై శ్రద్ధ, దృష్టి సారించాలన్నారు. ఎక్కువ దూరం ప్రయాణించే సమయంలో మధ్యలో వాహనాన్ని ఆపి, విశ్రాంతి తీసుకోవడం మం చిదని సూచించారు. వాహనంలో ప్రథమ చికిత్స కిట్‌ను తప్పనిసరిగా ఉంచుకోవాలని పేర్కొన్నారు.


అతి వేగం అనర్థదాయకం..

ఇటీవల కాలంలో యువత అత్యంత ఖరీదైన బైకులను వినియోగిస్తూ విపరీతమైన వేగంతో ప్రమాదాలకు గురవుతూ తల్లిదండ్రులకు తీవ్ర విషాదాన్ని మిగల్చవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ జీవితం విలువను గుర్తించి, తమపై ఆధారపడిన వారు, తమపై ఎన్నో ఆశలు పెట్టుకున్న వారు ఉంటారనే విషయాన్ని మనసులో ఉంచుకోవాలన్నారు.

కోలాహలంగా వసంతోత్సవం

ప్రజాశక్తి - దువ్వూరు

మండల కేంద్రంలోని శ్రీ మరకత సహిత వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న దేవీ శరన్నవరాత్రి దసరా ఉత్సవాల్లో సోమవారం విజయదశమి సందర్భంగా అంగరంగ వైభవంగా అమ్మవారు గ్రామోత్సవాన్ని నిర్వహించారు. దువ్వూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు లింగం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నరసింహ మూర్తి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం సాయంత్రం శమీ యాత్రలో అమ్మవారు జమ్మిచెట్టును దర్శించిన అనంతరం అంగరంగ వైభవంగా దువ్వూరు పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. తెనాలి బ్యాండ్, నృత్య సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించేందుకు మండల వ్యాప్తంగా ప్రజలు పోటేత్తారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బాణాసంచా వెలుగులు భక్తులను అబ్బురపరిచాయి. మంగళవారం ఉదయం అమ్మవారిశాల నుండి ప్రారంభమైన వసంతోత్సవాన్ని కోలాహలంగా నిర్వహించారు. ఒకరిపై ఒకరు వసంతాలు చల్లుకుంటూ ఉత్సాహంగా పాల్గొన్నారు. మంగళవారం రాత్రి ఏడు గంటలకు అమ్మవారు ఊయలసేవతో నవరాత్రులు వైభవంగా ముగిశాయి.


పవళింపు అలంకరణలో అమ్మవారు


జ్యోతి ఉత్సవాల్లో పాల్గొన్న బడిగింజల చంద్రమౌళి

సంప్రదాయాలను కొనసాగించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పురాతన సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బడిగింజల విజయలక్ష్మి, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగింజల చంద్రమౌళి సూచించారు. పట్టణంలోని చౌడేశ్వరి అమ్మవారి జ్యోతి ఉత్సవాల్లో మంగళవారం వారు మాట్లాడుతూ తొగటవీర క్షత్రియులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే చౌడేశ్వరి అమ్మవారి జ్యోతి ఉత్సవాల్లో పాల్గొనడం సంతోషకరమన్నారు. ఈ జ్యోతి ఉత్సవాలకు ఒక ప్రత్యేకస్థానం ఉందన్నారు. అత్యంత భక్తిశ్రద్ధలతో జ్యోతి ఉత్సవాలు నిర్వహించామన్నారు. చౌడేశ్వరి అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన చౌడేశ్వరి ఆలయ కమిటీ అధ్యక్షులు గంజికుంట తిరుమల దాస్, ఆలయ కమిటీ సభ్యులను వారు అభినందించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చాపాడు


మృతి చెందిన సుబ్బరాయుడు

మండలంలోని పల్లవోలు గ్రామ సమీపంలో మైదుకూరు-ప్రొద్దుటూరు ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి బస్సును ఢీకొని అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసు కుంది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. సికె దిన్నె మండలం బుగ్గలేటిపల్లెకు చెందిన ఉదయగిరి వెంకట సుబ్బరాయుడు(62) ప్రొద్దుటూరు లోని తన బామర్ది ఇంటికి వచ్చి వెళుతూ పల్లవోలు వద్ద ద్విచక్ర వాహనం డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డుకు అవతలివైపున వస్తున్న బస్సును ఢీకొన్నాడు. ఈప్రమాదంలో సుబ్బరాయుడు తల ఛిద్రమై అక్కడిక్కడే మృతి చెందాడు. ఆయనకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రొద్దుటూరులో యువకులపై కత్తులతో దాడి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

సరదాగా గడుపుదామని దసరా పండుగకు వచ్చి సంయమనం, సహనాన్ని పాటించకపోవడంతో ముగ్గురు జైలు పాయ్యారు. మరో ఇద్దరు ఆస్పత్రి పాలయ్యారు. ప్రొద్దుటూరు రామేశ్వరంలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకున్న ఈ సంఘటన వివరాలు సిఐ రాజారెడ్డి చెప్పిన మేరకు.. వేంపల్లెకు చెందిన పవన్ కళ్యాణ్, వెంకటేష్, నాగేంద్ర దసరా సంబరాల్లో పాల్గొనేందుకు ప్రొద్దుటూరుకు వచ్చారు. తొట్టిమెరవణి చూసుకొని ఆటోలో రామేశ్వరం వెళుతున్నారు. వెనుక నుండి మోటర్‌సైకిల్‌పై పెండ్లిమర్రి మండలానికి చెందిన ప్రసాద్, బయన్న, భరత్ వస్తున్నారు. రామేశ్వరం మోరీ వద్దకు రాగానే అక్కడ గుంతవద్ద ఆటో డ్రైవర్ నెమ్మదించాడు. ఈ సమయంలో వెనుకవైపు నుండి వచ్చిన ఆటో ఢీ కొంది. దీంతో వారిమధ్య మాటామాట పెరిగి తీవ్రస్థాయికి చేరి కత్తులతో పొడుచుకున్నారు. ఈ సంఘటనలో పవన్‌కళ్యాణ్, వెంకటేష్‌లకు తీవ్రగాయాలయ్యాయి. వెంకటేష్‌ను కడప రిమ్స్‌కు, పవన్‌కళ్యాణ్‌ను తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. ఆ సమయంలో ఆరుమంది మద్యం మత్తులో ఉన్నట్లు సమాచారం. నాగేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నామని, త్వరలో నిందితులను రిమాండ్‌కు పంపుతామని సిఐ తెలిపారు.


ఘర్షణలో గాయపడిన వ్యక్తి

26 మంది జూదరులు అరెస్టు

- రూ.14.66 లక్షల నగదు స్వాధీనం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ద్వారకా నగర్‌లో మంగతై ఆడుతున్న 26 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుండి రూ.14లక్షల 66వేల600 స్వాధీనం చేసుకున్నట్లు ఎఎస్‌పి ప్రేరణకుమార్ తెలిపారు. స్థానిక ఎఎస్‌పి కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ద్వారకానగర్‌లోని రామాలయం వద్ద మార్తల ఇంద్రసేనారెడ్డి ఇంటిలో అక్రమ సంపాదన నిమిత్తం చట్టవ్యతిరేకమైన మంగతై ఆడుతున్నారని సమాచారం రావడంతో రూరల్ పోలీసులు దాడి చేశారన్నారు. ఎస్‌ఐలు చిరంజీవి, శివప్రసాద్ వారి సిబ్బంది, సెబ్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి వారి సిబ్బందితో దాడి చేసి దర్గా చౌశేన్‌బాషతోపాటు మరో 25 మందిని అరెసుట చేశారని తెలిపారు. వారి వద్ద నుంచి నగదుతో 52 ప్లేయింగ్ కార్డ్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేశామని ప్రేరణకుమార్ తెలిపారు.


మాట్లాడుతున్న ఎఎస్‌పి ప్రేరణ్‌కుమార్